క్లుప్తంగా

వైభవంగా వెంకటేశ్వరుని కల్యాణం



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి కల్యాణాన్ని మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామి దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కూరగాయల విత్తనాల పంపిణీ



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఆదివారం గుడ్లవల్లేరులోని ఇంటింటికీ కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, క్లబ్ కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు, లయన్స్ ప్రతినిధులు సీహెచ్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సలీమ్‌బాషా



గుడ్లవల్లేరు: అంగలూరులోని ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ షేక్ సలీమ్‌బాషా ఆదివారం విధుల్లో చేరారు. గుంటూరు జిల్లా బోయపాలెం డైట్‌లో పని చేస్తున్న డాక్టర్ సలీమ్ బాషా ప్రిన్సిపాల్‌గా అంగలూరు జిల్లా డైట్‌లో బాధ్యతలను స్వీకరించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారిగా కూడా ఈయన అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆయన్ను లక్ష్మీనారాయణ, వినయ్‌కుమార్ తదితర అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా పుస్తకావిష్కరణ



గుడివాడ టౌన్: సమాజంలో వ్యక్తుల విశిష్టత వారి మరణానంతరం స్మరించుకోవడం వారి గొప్పదనానికి నిదర్శనమని ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్యామ్ అన్నారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో డాక్టర్ వి. శ్యామ్ రచించిన జీవన గ్రంథంలోని చివరి పేజీలు అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని దివంగత మట్టా మాణిక్యాలరావుకు అంకితం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రముఖుల జీవితాలు వారి చరిత్ర చివరి దశలో వారి అనుభవాలు, స్నేహం, బాంధవ్యం తదితర అంశాలు పొందుపర్చిన ఈ పుస్తకం సమాజానికి ఆదర్శం అని వక్తలు అన్నారు. కార్యక్రమంలో జి.అరుణ, కె.రవికుమార్, పి. ధర్మాచారి, సీహెచ్ చంద్రశేఖర్, ఎం.ఐజక్ న్యూటన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



కైకలూరు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.47,000లను విద్యార్థులకు ఉపకార వేతనాలు, సైకిల్, వయోవృద్ధులకు ఆర్థిక సాయం చెక్కులను సంస్థ కార్యాలయంలో ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాస్, సంస్థ సభ్యులు సత్యనారాయణ, వెంకటనారాయణ, శ్యామ్, గాలిబ్‌బాబు, మోహనరావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు పక్కా ప్రణాళిక

గుడ్లవల్లేరు మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీల ఉపాధి కల్పనకు ప్రణాళికాబద్ధంగా అధికారులు పనులను సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో కొత్త ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో చేపట్టబోయే పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు.

ప్రజలు, రైతులు కోరుకునే అవసరాలకే ప్రాధాన్యం



చెరువు పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

గుడ్లవల్లేరు: ఉపాధి పథకానికి సంబంధించి వచ్చే ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 6,200 మంది కూలీలకు పని దినాలు కల్పిస్తూ రూ.16.50 కోట్ల పనులను చేపట్టారు. మెటీరియల్‌కు రూ.9 కోట్లు, కూలీల వేతనాలకు రూ.7.50 కోట్లను కేటాయించాలని ప్రణాళికలు రూపొందించారు. గ్రామాల్లో వ్యక్తిగత, ఒంటెత్తు పోకడలకు పోకుండా కేవలం ప్రజలు, రైతులు కోరుకునే అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రజాభిప్రాయాల కోసం త్వరలో గ్రామసభలను నిర్వహించనున్నారు. ఉపాధి పనుల కల్పనకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

గ్రామ సభలే కీలకం

గుడ్లవల్లేరు మండలంలో ఏటా లక్ష్యానికి మించి ఉపాధి పనులను చేపట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ముందస్తుగా తయారు చేసుకున్న ప్రణాళికల ఆధారంగానే సకాలంలో పనులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పనుల నిర్వహణకు కీలకం గ్రామాల్లో ప్రజలు, రైతులు, కూలీలకు నిర్వహించే గ్రామ సభలే. ఉపాధి హామీలో భాగంగా కూలీలకు అధిక పని దినాలను కల్పించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఏటా గ్రామాల్లో చేపట్టబోయే పనులకు ముందుగానే గుర్తిస్తారు.

95 రకాలు పనులు

ఉపాధి పనుల్లో 95 రకాలు ఉంటాయి. ఆ పనుల్లో మన ప్రాంతానికి అనుకూలంగా ఉండే పనులను గుర్తించి గ్రామ సభల్లో అధికారులు సూచిస్తారు. ఉపాధి అధికారులు మండలంలో నిర్వహించే గ్రామసభల షెడ్యూల్‌ను రూపొందించనున్నారు. పంట బోదెల ఆధునికీకరణ, తాగునీటి, వాడుక చెరువుల్లో పూడిక తీతలు, చెరువుల కట్టలు బలపరచటం, మొక్కలు నాటడం తదితర పనుల కల్పనకు కృషి చేస్తున్నారు. గ్రామసభల్లో ఉపాధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తారు. ఈ గ్రామసభల నివేదికలను అనుసరించటంతో పాటు గ్రామాల నుంచి వచ్చే వినతులకు మండల పరిషత్, జిల్లా పరిషత్ ఆమోదానికి పంపిస్తారు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలో మండలం ప్రణాళికలపై ఉన్నతాధికారులకు నివేదిస్తారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో కొత్త ఆర్థిక సంవత్సరంలో పనులను ప్రారంభిస్తారు. క్లస్టర్ పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం మేరకు పనులు చేపట్టనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో క్లస్టర్ పరిధిలో 5,700 మందికి పని దినాలు కల్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జరిగే పనుల్లో 6,200 మందికి పని దినాలు కల్పించనున్నారు. యాక్టివ్ జాబ్ కార్డులు 5,700 ఉంటే అంతకు మించి 6,200 మంది కార్డుదారులకు పనులు కల్పించారు. వేతనాల రూపంలో ఇప్పటి వరకు రూ.6కోట్లు చెల్లించారు. మెటీరియల్ కాస్ట్‌గా ఇప్పటివరకు రూ.1.50 కోట్లు చెల్లించారు. మొత్తం మీద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.4.30కోట్ల పనులను చేపట్టారు. పని దినాలను కూలీలకు కల్పించారు. రోజుకు ప్రతి వేతనదారుడికి రూ.300 వేతనం కల్పించాలి. సగటున ఉపాధి కూలీకి వేతనం రూ.276 చెల్లిస్తున్నారు.

ప్రజావసరాలకే ప్రాధాన్యం



ప్రజలు, రైతులకు అవసరమైన పనులకే ప్రాధాన్యం ఇస్తున్నాం. అందుకే మేము నిర్వహించే గ్రామసభల్లో ప్రజావసరాలు తెలుసుకునేందుకు ప్రజా భాగస్వామ్యానికి అవకాశాలు ఇస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం సభలను త్వరలో నిర్వహిస్తున్నాం. గ్రామ సభల ప్రక్రియ అనంతరం ప్రణాళికాబద్ధంగా పనులను నిర్వహించనున్నాం.

– పి.రాంప్రసాద్, ఉపాధి హామీ ఏపీఓ, గుడ్లవల్లేరు

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి



క్యూలో భక్తుల సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఈఓ కొండలరావు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి అధికమైంది. ఆదివారం ఆలయ ప్రాంగణం వేలాది సంఖ్యలో భక్తులతో కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

కొండలమ్మను దర్శించుకున్న సీఐ

వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు ఆదివారం దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ ఈఓ ఆకుల కొండలరావు శేషవస్త్రంతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. ఆయనతోపాటు ఎస్ఐ ఎస్.వి.వి.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గంగానమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్టాపన



గంగానమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



గంగానమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

తోట్లవల్లూరు: వల్లూరుపాలెంలో గంగానమ్మతల్లి, పోతురాజుస్వామిల విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉదయం 11.11 గంటలకు గంగానమ్మతల్లి, పోతురాజుస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠా కార్యక్రమం కోలాహలంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గంగానమ్మతల్లిని, పోతురాజుస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ వేర్వేరుగా పాల్గొని గంగానమ్మతల్లికి, పోతురాజుస్వామికి పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోర్ల రామచంద్రరావు, పార్టీ నాయకుడు చింతలపూడి గవాస్కర్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్, కార్యదర్శి లుక్కా రేణుకారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గ ఎంపిక



పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గం

గుడివాడ టౌన్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం జరిగింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఎంపికలో అధ్యక్షుడిగా కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ బి.శ్యామ్‌కుమార్, కార్యదర్శిగా డాక్టర్ ఎస్.కృష్ణమోహన్, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎల్ఆర్‌కె. ప్రసాదు, కె.వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా పి. కృష్ణప్రసాద్, ఎం. నారాయణ ప్రసాదు, కె. రంగప్రసాదు, డీఆర్‌బీ.ప్రసాదు, వి.కిషోర్ నియమితులయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను కళాశాల కరస్పాండెంట్ కేవీఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ అభినందించారు.

విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాసం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమేష్‌బాబు

పామర్రు: విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తే ఆయా విద్యార్థుల భవిష్యత్ బాగుంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ బాబు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టూడియో వద్ద మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో తల్లిదండ్రులపై అనురాగం, ప్రేమను పంచుతూ నీతి వాక్యాలను బోధిస్తే ఆ కుటుంబంతోపాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. పాత శాంతి రథం స్థానిక కొత్తశాంతి రథం ఏర్పాటు చేసిన దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఫ్రీజర్ బాక్స్‌ను నూకల రమేష్ త్వరలో అందజేయనున్నారని తెలిపారు. మానవత అధ్యక్షుడు పామర్తి వెంకట నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పామర్రు శాఖ అధ్యక్షుడు శీతాలప్రసాద్, రీజియన్ కార్యదర్శి పీఎంఎస్ ప్రసాద్, కన్వీనర్ ఎస్.త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేకు చుక్కెదురు

- తాను చెప్పిన పనులను మాత్రమే ఆమోదించాలని హుకుం
- సమావేశానికి హాజరుకాని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు
- కోరం ఆమోదం లేకపోవడంతో వెనుదిరిగిన ఎమ్మెల్యే వర్ల

సాక్షి నెట్ వర్క్: పామర్రు నియోజకవర్గ పరిధి పెదపారుపూడి మండలంలో ఈ నెల 26న జరిగిన సర్వసభ్య సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు చుక్కెదురైంది. వివరాల్లోకి వెళితే.. సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులను తీసుకురావటం, వారి మాటలకు అనుగుణంగానే తీర్మానాలు చేశారు. దీనికి వ్యతిరేకంగా ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు ఎవరూ హాజరు కాలేదు. సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే తాను అనుకున్న పనులను మాత్రమే తీర్మానంలో పెట్టాలని అధికారులకు హుకుం జారీ చేశారు. ఉన్న మొత్తం తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులను సంప్రదించకుండా తాను అనుకున్న పనులనే చేయాలంటూ ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు జారీ చేయటం జరుగుతోంది. ఇది నచ్చని స్థానిక ఎంపీటీసీ సభ్యులు అందరూ మూకుమ్మడిగా సమావేశానికి హాజరు కాలేదు. దీంతో ఎమ్మెల్యే తాను అనుకున్న పనులకు కోరం అనుమతి లభించ లేదు. దీనిని కప్పిపుచ్చుకోవడం కోసం ఎమ్మెల్యే సమావేశంలో అన్ని శాఖల అధికారులతో మాట్లాడి సీసీ రోడ్లకు ఆమోదం తెలపండి, ఆర్‌డబ్ల్యూఎస్‌లకు ఆమోదం తెలపండి అంటూ హుకుం జారీ చేసి, అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సమాజాభివృద్ధికి మానవత కృషి

మండవల్లి: మెరుగైన సమాజం కోసం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తుందని విశ్రాంత హైస్కూల్ హెచ్ఎం కె.సూర్యారావు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆ సంస్థ అధ్యక్షుడు గణేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మానవత ద్వారా వేలాది మందికి ఆర్థిక సాయం, నెలవారీ సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్థిక సమస్యల్లో ఉన్నవారికి పచారీ సరుకులు అందజేశారు. గన్నవరం గ్రామానికి చెందిన విద్యార్థిని లక్ష్మీశరణ్యకు రూ.1.75 లక్షలు సాయం చేసినట్లు పేర్కొన్నారు. కెరీర్ గైడెన్స్ డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యకాంతం జయంతి వేడుకలు

గుడివాడ టౌన్: ప్రముఖ సినీనటి సూర్యకాంతం శత జయంతి వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు భవిరి శంకరనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాటం



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు

వేములమడ(మొవ్వ): గ్రామాల్లో ఉన్న సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తూ వాటి పరిష్కారానికి నాయకులు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పేర్కొన్నారు. మొవ్వ మండలం వేములమడలో సీపీఎం మండల ఎనిమిదో మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆ పార్టీ జెండాను సీనియర్ నాయకుడు బత్తిన రామచంద్రరావు ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యుడు శీలం నారాయణరావు అధ్యక్షతన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నివాసాల మధ్యలో ఉన్న మద్యం దుకాణాలను మరో ప్రాంతానికి బదిలీ చేయాలని, రైతులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత ఇసుక పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులుశివ నాగేంద్రం, మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మండల కమిటీ సభ్యుడు మద్దుల బసవయ్య పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఏడుగురు సభ్యులతో కూడిన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ కార్యదర్శిగా శీలం నారాయణరావుని ఎన్నుకున్నారు. సభ్యులుగా ఉప్పలపు వెంకటాద్రి, బొల్లా సుబ్రమణేశ్వరరావు, కాకి రాజశేఖర్, కొడాలి కరుణాకర్ రావు, మాదాసు నాగులు, చేబ్రోలు బసవపూరణ్ నియమితులయ్యారు.

తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర ఆరుద్ర



ప్రసంగిస్తున్న సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్

గుడివాడ టౌన్: తెలుగు సాహిత్యాన్ని అన్ని విభాగాల్లో పొందుపర్చి రచనలు చేసిన సాహితీవేత్త ఆరుద్ర అని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్ అన్నారు. స్థానిక ఏజీకే హైస్కూల్లో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం ఆరుద్ర శత జయంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహన్ మాట్లాడుతూ ప్రజలకోసం వారి సమస్యలను ప్రతిబింపజేసేలా సాహిత్యం సృజింపచేసిన గొప్ప కవి ఆరుద్ర అన్నారు. భాషా పరిశోధకుడిగా, సినీ కవిగా సాహిత్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఆరుద్రను స్మరించుకోవాలసిన అవసరత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సాహితీ ప్రముఖులు కె. గాంధిబాబు, కె. సోమసుందరరావు, సాహితీ స్రవంతి కన్వీనర్ వసుధ బసవేశ్వరరావు, ఎల్. ధనేశ్వరి, నవీన్‌కుమార్, శ్రీనుబాబు, వై.కోటేశ్వరరావు, జి. మాల్యాద్రి, వంగా వంశి, జీఎమ్ పీటర్, బాస్కరరావు, డి. బెనర్జి పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది శ్రమదానం



కైకలూరు బీసీ హాస్టల్లో శ్రమదానం చేస్తున్న పట్టణ పోలీసులు

కైకలూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం పోలీసు సిబ్బంది కైకలూరు బీసీ బాలుర వసతి గృహంలో చెత్తను తొలగించి శ్రమదానం చేశారు. కైకలూరు పట్టణ సీఐ పి.కృష్ణ నిర్వహణలో పట్టణ ఎస్ఐలు సత్యనారాయణ, డి.వెంకటకుమార్, పోలీసు సిబ్బంది చెత్తను సేకరించారు. సీఐ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పలు కార్యక్రమాలను చేపట్టామన్నారు. హాస్టల్ వార్డెన్ నిర్మల, సిబ్బంది పవన్, పేరబాబు, గాంధీ పాల్గొన్నారు. కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో ఎస్ఐలు వేంకటేశ్వరరావు, వీరభద్రారావు హాస్టల్స్‌లో శ్రమదానంలో భాగంగా చెత్తను తొలగించారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

కైకలూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) పనులపై మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫణీంద్ర ఆదివారం తెలిపారు. సభలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన పనులపై ఆడిట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



మండవల్లి: ఎదురెదురుగా వస్తున్న మోటారు సైకిళ్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు మండలంలోని భైరవపట్నం రైల్వేగేట్ మధ్యలో ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న రోడ్ సేఫ్టీ పోలీస్ సిబ్బంది వెంటనే వారిని ప్రైవేట్ వాహనంలో కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అన్న సమారాధన



కైకలూరు: చండీ మహాయాగ సహిత దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా శ్యామలాంబ దేవస్థానం వద్ద ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ ఏర్పాట్లును పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, శ్యామలాంబ దేవస్థాన గౌరవాధ్యక్షుడు జంపన రామలింగరాజు, కూటమి నేతలు పూల రామచంద్రరావు, వేంపాటి విష్ణురావు, ఉత్సవ కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, బలరామకృష్ణ పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లను అదుపు చేయాలి



అనంతలక్ష్మి, ఏఓ

గుడ్లవల్లేరు: వరి సాగులో విజృంభించే తెగుళ్లను అదును సమయంలో అదుపు చేసుకోవాలి. తెగుళ్లను అదునులో నివారిస్తే సాగు ఖర్చు ఆదా అవుతుంది. కాండం కుళ్లు, మెడ విరుపు, మానిపండు తెగుళ్ల నివారణపై గుడివాడ వ్యవసాయాధికారి బి.అనంతలక్ష్మి ఇస్తున్న సలహాలు ఇవే..

దుబ్బు ఎండిపోతే కాండం కుళ్లినట్లే..

కాండం కుళ్లు తెగులు తీవ్రత ఎక్కువయ్యే కొలది వరి దుబ్బు పూర్తిగా ఎండిపోతుంది. ఈ శిలీంధ్రం ఆశించటం వలన కణుపుల వద్ద కాండం లోపలి కణజాలం కుళ్లి నల్లగా మారుతుంది. కీటకాలు ముఖ్యంగా దోమ, కాండం తొలిచే పురుగులు చేసిన గాయాల ద్వారా మొక్కల్లోకి ప్రవేశిస్తాయి. తెగులు లక్షణాలను గుర్తించిన వెంటనే హెక్సాకోనాజోల్ 400 మిల్లీలీటర్లను పిచికారీ చేసుకోవాలి. మొక్కల మొదళ్లు బాగా తడిచేటట్లు పిచికారీ చేసుకోవాలి.



మానిపండు తెగులు

మెడ విరుపుతో తాలు గింజలు

అగ్గి తెగులు లేక మెడ విరుపు తెగులు కారణంగా గింజలకు పోషక పదార్థాలు అందక తాలు గింజలు అవుతాయి. వారం రోజుల పాటు 20 డిగ్రీల సెంటిగ్రేడ్ రాత్రి ఉష్ణోగ్రతలు, గాలిలో 90 శాతం కంటే తక్కువ తేమ, మంచు లేదా వర్షపు జల్లులు ఈ తెగులు ఉద్ధృతికి దోహదం చేస్తాయి. లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మిల్లీ లీటర్ల ఐసోప్రోథయోలేన్ లేదా 2.5 మిల్లీ లీటర్ల కొసుగామైసిన్‌ను పైరు బాగా తడిసేలా పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి మళ్లీ 10 నుంచి 15రోజులకు రెండోసారి మందును మార్చి పిచికారీ చేసుకోవాలి.



మెడవిరుపు దశ

మానిపండుతో గింజలకు నాణ్యతా లోపం

పైరు పూత దశలో మంచు లేక వర్షం పడినపుడు ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. దీంతో గింజల నాణ్యత తగ్గుతుంది. పైరు పుష్పించే దశలో ప్రోపికోనాజోల్ 1.0 మిల్లీలీటర్లు లేదా కార్బండిజమ్ ఒక గ్రామును లీటరు నీటికి కలిపి సాయంత్రం వేళలో పిచికారీ చేయాలి.